


కోతులను తరిమినోళ్లకే..

పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల్లో గ్రామాల్లో కోతులు, కుక్కల నివారణే ప్రధాన ఏజెండాగా మారనుంది.
8లో



రైతులకు 'పూల'బాట !

ముష్టికుంట్ల రైతులు వాణిజ్య పంటలకు స్వస్తి చెప్పి ఉద్యానవన పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు.
8లో

గరిష్టం / కనిష్టం
$32^{\circ} / 23^{\circ}$

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారి దేవస్థానంలోని స్వామివారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన పూజలు చేశారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వారాంతపు సెలవు దినాలు కావడంతో నిత్యకల్యాణంలో, ఆర్జిత సేవల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న సేవా సమితి నిర్వాహకులు

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారి పాదానికి, శ్రీ స్వామివారి విగ్రహానికి వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం గావించారు. శ్రీవారిని, శ్రీ అలివేలు మంగ, శ్రీ పద్మావతి అమ్మవార్లను సుందరంగా అలంకరించి నిత్య కల్యాణ వేడుకను ఘనంగా నిర్వహించగా భక్తులు కనులపండువగా తిలకించారు. ఆ తర్వాత శ్రీవారికి పల్లకీ సేవ చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల భక్తులు శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ వేంకటేశ్వర అన్నదాన సేవా సమితి నిర్వాహకులు బొబ్బ కృష్ణప్రసాద్, ఎల్వీ నారాయణరెడ్డి, కాకుమాను లీలాకృష్ణ, ఇమ్మడి ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్, చొప్పవరపు శ్రీనివాసరావు, గిరిజాలక్ష్మి, తదితరులు 500 మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కొత్తూరి జగన్ మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధానార్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ సీఈగా సుధీర్

పాల్వంచరూరల్: జలవనరుల శాఖ జిల్లా చీఫ్ ఇంజనీర్‌గా(సీఈ)గా వరంగల్ జిల్లా సీఈ ఆర్.సుధీర్‌కు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేసిన సీఈ శ్రీనివాసరెడ్డి గత నెల 30న ఉద్యోగ విరమణ పొందాడు. ఆయన స్థానంలో సుధీర్‌ను నియమించారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు ఆయన పర్యటన ప్రారంభం కానుండగా ఖమ్మం నగరంతో పాటు కూసుమంచి, మధిర, వేంసూరు మండలాల్లో కొనసాగుతుంది. అయా మండలాల్లో పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

రేపు అండర్ -19 టీటీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్ : ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-19 బాలబాలికల టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపికలు ఈనెల 6న ఉదయం 9 గంటలకు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు క్రీడల సంఘం కార్యదర్శి ఎం.డి.మూసాకలీం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీన బాలబాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్ సెకండ్ ఇయర్ వరకు చదువుతున్న వారు పోటీలకు అర్హులని, అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు జారీ చేసిన స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు.

ఇద్దరు మద్దతిస్తే..

అక్కడ ఎంపీపీగా గెలవొచ్చు

- నాలుగు మండలాల్లో ఐదు చొప్పన ఎంపీటీసీ స్థానాలు
- ఏడింటిలో పదిలోపే ఎంపీటీసీలు
- తక్కువ స్థానాలు ఉన్నచోట మండల పరిషత్ పోరు రసవత్తరం



ఐదు ఎంపీటీసీ స్థానాలున్న కరకగూడెం మండల పరిషత్ కార్యాలయం

చుంచుపల్లి: అతి తక్కువ ఎంపీటీసీ స్థానాలున్న మండలాల్లో ఎంపీపీ ఎన్నిక రసవత్తరంగా మారనుంది. అక్కడ ఎంపీపీ కావాలంటే గెలిచిన అభ్యర్థికి ఇద్దరు మద్దతిస్తే సరిపోతుంది. జిల్లా విభజన తర్వాత కొత్తగా ఆరు మండలాలు ఏర్పాటయ్యాయి. అయితే ఈ మండలాల్లో ఎంపీపీ అధ్యక్ష పదవి విషయంలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. ఒకప్పుడు ఎంపీపీ పీఠం దక్కించుకోవాలంటే ప్రధాన పార్టీల నాయకులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. మండలాలు చిన్నవి కావడంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య తగ్గింది. దీంతో పలుచోట్ల ఇద్దరు, ముగ్గురు మద్దతిచ్చినా ఎంపీపీ పదవి దక్కించుకునే అవకాశం ఉంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అంతటా ఇదే చర్చ జరుగుతోంది. జిల్లాలోని 22 మండలాల్లో పది లోపు ఎంపీటీసీ స్థానాలున్న మండలాలు ఏడు ఉన్నాయి. ముఖ్యంగా ఆళ్లపల్లి, కరకగూడెం, గుండాల, సుజాతనగర్, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో మండల పరిషత్ కార్యవర్గానికి ఐదారుగురు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎన్నికల అనంతరం ఈ మండలాల్లో జరిగే సమావేశాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను మినహాయిస్తే ముగ్గురు సభ్యులు మాత్రమే ఉంటారు. మరికొన్ని చోట్ల నలుగురు, ఐదుగురు సభ్యులు మాత్రమే ఉండనున్నారు. ఈ మండలాల్లో కో – ఆప్షన్ ఎన్నిక జరిగితే ఒకరిద్దరు సభ్యుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. చేతులెత్తి ఎన్నుకునే ఎంపీపీ పదవికి అక్కడ సభ్యుల మద్దతు కీలకంగా మారనుండగా అక్కడ గెలుపొందిన ఎంపీటీసీ సభ్యులకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.

తక్కువ ఎంపీటీసీ స్థానాలున్న మండలాలు

మండలం	ఎంపీటీసీ స్థానాలు	ఎంపీపీ రిజర్వేషన్
ఆళ్లపల్లి	5	ఎస్టీ జనరల్
కరకగూడెం	5	ఎస్టీ జనరల్
గుండాల	5	ఎస్టీ మహిళ
సుజాతనగర్	5	ఎస్టీ జనరల్
అన్నపురెడ్డిపల్లి	6	ఎస్టీ మహిళ

స్థానాల వివరాలిలా..

- ఆళ్లపల్లి మండలం గుండాల నుంచి విడిపోగా, 2019లో నాలుగు ఎంపీటీసీ స్థానాలు మాత్రమే ఉండేవి. ప్రస్తుతం ఐదుకు పెరిగాయి. ఇక్కడ జెడ్పీటీసీ స్థానాన్ని జనరల్ మహిళకు కేటాయించగా ఎంపీపీ పదవిని ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ చేశారు. ఎంపీపీ పదవి కావాలనుకునే సభ్యుడికి మరో ఇద్దరు ఎంపీటీసీల మద్దతు అవసరం.
- పినపాక నుంచి విడిపోయిన కరకగూడెం మండలంలో మొదట నాలుగు ఎంపీటీసీ స్థానాలుండగా ఈసారి ఒకటి పెరిగింది. జెడ్పీటీసీ బీసీ మహిళకు, ఎంపీపీ స్థానాన్ని ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. ఇక్కడ కూడా ఎంపీపీ పదవి పొందాలనుకునే సభ్యుడికి ఇద్దరు ఎంపీటీసీల మద్దతు కావాలి.
- గుండాలలో ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎంపీపీ స్థానాన్ని 2019లో ఎస్టీ జనరల్ అభ్యర్థికి కేటాయించగా, ఈసారి ఎస్టీ మహిళకు దక్కింది. జెడ్పీటీసీని జనరల్ అభ్యర్థులకు కేటాయించారు. ఇక్కడ ఎంపీపీ పదవి పొందాలనుకునే సభ్యుడికి మరో ఇద్దరు ఎంపీటీసీల సహకారం అవసరం. జెడ్పీటీసీ జనరల్ కావడంతో పలువురు నాయకులు ఇటువైపు కన్నేయగా పోటీ తీవ్రంగా ఉండే అవకాశం ఉంది.
- అన్నపురెడ్డిపల్లి గతంలో చంద్రుగొండ మండలంలో ఉండేది. ప్రస్తుతం ఈ మండలంలో ఆరు ఎంపీటీసీస్థానాలు ఉండగా 2019లో ఎంపీపీ పదవిని ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. ఈసారి ఎస్టీ మహిళకు రిజర్వ్ చేశారు. ఎంపీపీ పదవి కావాలనుకునే అభ్యర్థికి మరో ముగ్గురు సభ్యుల మద్దతు అవసరం.
- సుజాతనగర్ మండలంలో ఎనిమిది ఎంపీటీసీ స్థానాలు ఉండేవి. ఇటీవల కొత్తగూడెం కార్పొరేషన్‌లో పలు గ్రామాలు కలవడంతో ఆ సంఖ్య ఐదుకు తగ్గింది. ప్రస్తుతం ఇక్కడ జెడ్పీటీసీ బీసీ జనరల్‌కు, ఎంపీపీ పదవి ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ చేశారు. ఎంపీపీ కావాలనుకునే ఎంపీటీసీకి మరో ఇద్దరు సభ్యుల సహకారం అవసరం.

ఆయిల్‌పామ్‌తో స్థిర ఆదాయం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, వేదికపై ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, ఎమ్మెల్యేలు జారె, కూనంనేని

- 'కల్లూరుగూడెం' పూర్తయ్యాక అశ్వారావుపేటలో మరో ఫ్యాక్టరీ
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు స్థిర ఆదాయం పొందుతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని లింగాలపల్లి శివారు వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి మంత్రితోపాటు ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, అశ్వారావుపేట, కొత్తగూడెం ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయ్యాక అశ్వారావుపేటలో మరో ఫ్యాక్టరీ నిర్మిస్తామని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, అంతర పంటల సాగు పరిశీలనకు ఆయిల్ ఫెడ్ ద్వారా రైతులను పక్క రాష్ట్రాలకు తీసుకెళ్లే ఏర్పాటు చేస్తామన్నారు. ఫ్యాక్టరీలకు గెలలు పోటెత్తిన సందర్భాల్లో దిగుమతిలో జాప్యం కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పామాయిల్ మొక్కలు నాటే ప్రక్రియను ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేస్తామని తెలిపారు. భూ ధ్రువ పత్రాలతో సంబంధం లేకుండా సాగుచేసే ప్రతీ రైతుకు ఆయిల్‌పామ్ మొక్కలను ఉచితంగా అందజేస్తామని అన్నారు.

తప్పులను సరిదిద్దుతున్నాం : జంగా

గతంలో ఆయిల్ ఫెడ్‌లో జరిగిన తప్పులను సరిదిద్దుతున్నామని ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. ఆఫ్ టైప్, నాణ్యతలేని మొక్కలను తొలగించి కొత్త మొక్కలను నాటుతామని తెలిపారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ఫ్యాక్టరీల ఏర్పాటుతో ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సాగవుతున్న వరిపంట విస్తీర్ణానికి సమానంగా పామాయిల్ సాగయ్యేలా మంత్రి తుమ్మల కృషి చేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివాసీలకు ప్రత్యేక రాయితీలు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఖమ్మం డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, అలపాటి ప్రసాద్, చల్లగుళ్ల కృష్ణయ్య, చల్ల గుళ్ల నరసింహారావు, కందిమళ్ల కృష్ణారావు, బండి భాస్కర్, మొగళ్ల చెన్నకేశవరావు, కొయ్యల అచ్యుతరావు, పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి సరఫరా

జెడ్పీ నుంచి మండలాలకు కరదీపికలు, ఇతర సామగ్రి పంపిణీ



జెడ్పీలో ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తున్న అధికారులు

చుంచుపల్లి: రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక పోరుకు షెడ్యూల్‌ను ప్రకటించడంతో జిల్లాలో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. అధికారులు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నిక ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. బ్యాలెట్ పెట్టెలను మరోసారి పరిశీలన చేస్తూ అవసరమైన మరమ్మతులు చేపడుతున్నారు. ఎన్నికల సామగ్రిని జెడ్పీ కార్యాలయం నుంచి మండలాలకు వాహనాల్లో తరలిస్తున్నారు. జిల్లాలో ఈనెల 23, 27వ తేదీల్లో రెండు విడతల్లో పరిషత్ ఎన్నికలు జరుగనున్నాయి. జిల్లాలో 22 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, మొదటి విడతలో 11మండలాల పరిధిలో 113 ఎంపీటీసీలకు, రెండో విడతలో మరో 11మండలాల పరిధిలో 120 ఎంపీటీసీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రతీ మండలానికి 86 రకాల నమూనా ఫారాలు, కవర్లు, పోటీచేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, ప్రచార ఖర్చుల పుస్తకాలు, అఫిడవిట్ పత్రాలు, పోస్టల్ బ్యాలెట్ కవర్లు, ఎన్నికల పోటీ అభ్యర్థులకు, సిబ్బందికి అవసరమయ్యే ఎన్నికల నియమావళి కరదీపికలతోపాటు 21రకాల పోలింగ్ సామగ్రిని తొలి విడతలో పంపిణీ చేస్తున్నారు. ఇంకా పూర్తిస్థాయిలో జిల్లాకు ఎన్నికల సామగ్రి రావాల్సి ఉంది. ఎన్నికల నిర్వహణకు 56 రకాల వస్తువులను పంపిణీ చేయాల్సి ఉంటుంది. వీటిలో సిరా, కార్డు బోర్డులు, పెన్నులు, రబ్బర్లు, పెన్సిళ్లు, రబ్బర్ బ్యాండ్లు, కొవ్వొత్తులు, తెల్లవస్త్రాలు, బేసిన్లు, తెల్ల కాగితాలు, నామినేషన్ పత్రాలు, గోనెసంచులు, ట్రంకు పెట్టెలు, లక్క, టబ్బులు, అభ్యర్థుల గుర్తుల పత్రాలు, నోటీసు బోర్డులు, సూదులు, టేపులు, అగ్గిపెట్టెలు, బ్లేడ్లు, వైర్లు,దారాలు, అభ్యర్థుల పాసులు వంటివి ఉంటాయి.

పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి

సమావేశంలో కాంగ్రెస్ నాయకులు



అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొదెం వీరయ్య అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పనిచేయాలని అన్నారు. అనంతరం పొదెం వీరయ్య మాట్లాడుతూ పోటీ చేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం అశ్వారావుపేట, ఇల్లెందు, సోమవారం పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గానికి ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి జెడ్పీటీసీ అభ్యర్థులను ఎంపిక చేస్తామని, స్థానిక శాసనసభ్యుల సిఫార్సులను కూడా పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. తొలుత రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతి పట్ల మౌనం పాటించారు. ఈ సమావేశంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీలు మోతుకూరి ధర్మారావు, నాగ సీతారాములు, నాయకులు బాల శౌరి, ఏనుగుల అర్జునరావు, తోట దేవి ప్రసన్న, పసుపులేటి వీరబాబు, గడిపల్లి కవిత, కొత్వాల శ్రీనివాస్, కోనేరు చిన్ని, యడవల్లి కృష్ణ, బిక్కసాని నాగేశ్వరరావు, జలీల్, మొహమ్మద్ ఖాన్, చీకటి కార్తీక్, రామ్ లక్ష్మణ్, సురేష్ నాయక్, గద్దల రమేష్, నూకల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

'ఇసుక' నివేదికపై అభ్యంతరాలు తెలపాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇసుక తవ్వకాల సమగ్ర నివేదికపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 25లోగా కలెక్టరేట్‌లోని 11వ నంబరు గదిలోని భూగర్భశాఖ కార్యాలయంలో ప్రజలు తమ సలహాలు, సందేహాలు, అభ్యంతరాలు తెలపాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక తవ్వకాలపై జిల్లాస్థాయి నివేదికలు ఇవ్వాలని సాంకేతిక శాఖలైన నీటిపారుదల, భూగర్భజల, గనులు, భూగర్భశాఖ, టీఎస్ఎండీసీ ప్రాజెక్టు ఆఫీసర్, ఫారెస్ట్, రెవెన్యూ, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కార్యాలయాలను ఆదేశించినట్లు పేర్కొన్నారు. దీంతో సంబంధిత శాఖల అధికారులు శాఖల వారీగా నివేదికలను అందజేశారని తెలిపారు. పూర్తిస్థాయి జిల్లా సమగ్ర నివేదిక తయారు చేసి https:// kothagudem. telangana. gov. in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అభ్యంతరాలు, సలహాలు ఉంటే ఈ నెల 25వ తేదీలోగా admgktdm@ gmail. comకు పంపాలని సూచించారు.

భద్రగిరిలో 'స్థానిక' వేడి

- జెడ్పీటీసీ పీఠంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ గురి
- విద్య, వైద్య రంగ ప్రముఖులకు ఎర
- పొత్తుల దిశలో సీపీఎం, సీపీఐలు
- హైకోర్టు తీర్పు కోసం వేచి చూస్తున్న పార్టీలు



భద్రాచలం: భద్రాచలం జెడ్పీటీసీ పీఠంపై అధికార, ప్రతిపక్షాలు గురిపెట్టాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఇక్కడ తొలిసారి జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతుండగా, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. మిత్రపక్షాలైన సీపీఎం, సీపీఐలు చర్చల దిశలో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆధ్యాత్మిక క్షేత్రమైన భద్రగిరిలో ఎన్నికల వేడి రాజుకుంది.

విద్య, వైద్య రంగ ప్రముఖులతో సంప్రదింపులు!

భద్రాచలం జెడ్పీటీసీ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు బీసీ మహిళా అభ్యర్థి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల్లో భారీగా ఖర్చు పెట్టాల్సి ఉండటం, పట్టణంలో ప్రజలతో పరిచయాలు, ప్రముఖులతో సత్సంబంధాలు ఉన్న వారితో రాయబారాలు సాగిస్తున్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, డివిజన్ నాయకుడు రాంప్రసాద్ కలిసి ప్రముఖ వైద్యుడు మోహన్ రావు సతీమణిని రంగంలో దింపేందుకు సదరు వైద్యుడితో సంప్రదింపులు జరిపారు. ఆమె బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు బుడగం శ్రీనివాస్‌కు స్వయానా సోదరి కావడంతో కాంగ్రెస్ నాయకులు ఆ ప్రయత్నానికి ఆదిలోనే చెక్ పెట్టారు. ఆమెను కాంగ్రెస్ తరఫునే బరిలోకి దింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్థిక, రాజకీయ బలం కలిసి వస్తుందని భావిస్తున్నారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు భద్రాచలంలోనే క్రాంతి విద్యాలయం అధినేత సోమరౌతు శ్రీనివాసరావు సతీమణితో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌నే గెలుస్తుందని, విజయం తప్పక తమదేనంటూ కేటీఆర్‌తో కూడా హామీ ఇప్పించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా రెండు పార్టీలు విద్య, వైద్య రంగాల ప్రముఖులపైనే ఆధారపడనున్నాయి. ఈ నెల 8న ఉన్న హైకోర్టు తీర్పు అనంతరమే ఈ అభ్యర్థుల ఖరారు చేసే అవకాశం ఉంది.

సీపీఎం, సీపీఐ, టీడీపీలు పొత్తుతో సరి?

సీపీఎం, సీపీఐ, టీడీపీ పొత్తులతో బరిలో నిలిచి బల నిరూపణకు సిద్ధమవుతున్నాయి. వార్డుల్లో బలం ఉన్న సీపీఎం ఇందులో ముందుంది. ఇప్పటికే బీఆర్ఎస్ నాయకులతో ఆ పార్టీ నాయకులు చర్చలు జరిపారు. ఎనిమిది వార్డులు, వైస్ ఎంపీపీ, ఎక్స్ అఫిషియో సభ్యుడిని కేటాయించాలని బీఆర్ఎస్‌కు ప్రతిపాదించగా, ఐదు వార్డులను ఇచ్చేందుకు వారు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇదే ప్రతిపాదనను కాంగ్రెస్ పార్టీ ముందు కూడా ఉంచనుంది. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో చర్చలు జరపనున్నారు. తమ డిమాండ్లకు ఏ పార్టీ అంగీకరించిన వారితో కలిసి ముందుకు సాగేందుకు సిద్ధంగా ఉన్నామని, అయితే కాంగ్రెస్‌తో కలిసే అవకాశమే ఎక్కువగా ఉందని సీపీఐ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఇక టీడీపీ అధిష్టానం నిర్ణయం కోసం వేచి చూస్తోంది. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమిగా, ఒంటరిగా, లేదా కాంగ్రెస్‌తో, లౌకిక పార్టీలతో కలిసి వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నాయి. బీఆర్ఎస్‌తో మాత్రం పొత్తు ఉండే అవకాశం లేదని వారు తేల్చిచెబుతున్నారు. సీపీఐ సైతం పొత్తుతోనే ముందుకు వెళ్లే అవకాశం ఉంది. ఇలా అన్ని పార్టీలు భద్రాచలం జెడ్పీటీసీ ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో భద్రాచలం జెడ్పీటీసీని తొలిసారి కైవసం చేసుకునేందుకు ఆర్థిక, రాజకీయ బలాలను వాడేందుకు సిద్ధమయ్యాయి.

క్లుప్తంగా

కొనసాగుతున్న నిమజ్జనం



నిమజ్జనం కోసం లాంచీలో అమ్మవారి విగ్రహాన్ని తరలిస్తున్న సిబ్బంది

భద్రాచలంటౌన్: భద్రాచలం గోదావరి తీరంలోని ఏర్పాటు చేసిన నిమజ్జన ఘాట్‌కు వరుసగా మూడో రోజు శనివారం భారీగా దుర్గామాత విగ్రహాలు నిమజ్జనానికి తరలిచ్చాయి. శరన్నవరాత్రుల సందర్భంగా పూజలు చేసిన భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి అమ్మవారి ప్రతిమలను నిమజ్జనానికి తీసుకొచ్చారు. విగ్రహాలను భారీ క్రేన్ల సహాయంతో వాహనాల నుంచి దించి లాంచీల ద్వారా గజ ఈతగాళ్లు నదిలో నిమజ్జనం చేస్తున్నారు. గోదావరిలో వరద ఉధృతి ఉండటంతో భక్తులను నిమజ్జన ఘాట్ వద్దకు అనుమతించడంలేదు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: వరకట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్త, ఆడబిడ్డలపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని నాగారం కాలనీకి చెందిన భూక్యా వాణిశ్రీకి సుజాతనగర్ మండలం సర్వారానికి చెందిన, ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న నరేంద్రతో 2023లో వివాహం జరిగింది. కొద్దిరోజులుగా భర్త, అత్త, ఆడబిడ్డ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

కానిస్టేబుల్‌తో గొడవ పడిన వ్యక్తిపై..

పాల్వంచరూరల్: కానిస్టేబుల్‌తో గొడవ పడిన వ్యక్తిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమ్మగుడి వద్ద శుక్రవారం రాత్రి గొడవ జరుగుతుందని సమాచారం అందుకున్న కానిస్టేబుల్ సత్యం సంఘటనా స్థలానికి వెళ్లాడు. గొడవను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తుండగా జగన్నాథపురానికి చెందిన అడపా నాగేంద్రబాబు అనే వ్యక్తి కానిస్టేబుల్‌పై తిరగబడ్డాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ప్రమాద ఘటనపై..

భద్రాచలంఅర్బన్: రోడ్డు ప్రమాద ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. భద్రాచలం పట్టణంలోని కొత్త మార్కెట్ వద్ద గత నెల 28న ద్విచక్రవాహనం ఢీకొని రమణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేయగా, ప్రమాదానికి కారణమైన గోపిచంద్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాలలో వంట పాత్రలు చోరీ

జూలూరుపాడు: జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంట పాత్రలను చోరీ చేసిన సంఘటన శనివారం వెలుగుచూసింది. దసరా సెలవుల అనంతరం పాఠశాలలను శనివారం తిరిగి ప్రారంభించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సిద్ధం చేసేందుకు సిద్ధమవుతుండగా కొన్ని వంట పాత్రలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం లక్ష్మీనరసయ్య తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

భద్రాచలంఅర్బన్: అనుమతి లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శనివారం భద్రాచలం పోలీసులు సీజ్ చేశారు. పట్టణంలోని కొల్లుగూడెం వద్ద గోదావరి నుంచి ఇసుక నింపుకుని వస్తుండగా పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేశారు.

రెండు మట్టి లారీలు సీజ్



అటవీశాఖ అధికారులు పట్టుకున్న లారీ

ములకలపల్లి: అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్ లారీలను అటవీశాఖ అధికారులు సీజ్ చేశారు. మాధారం ఎఫ్ఎస్‌ఓ హరిప్రసాద్ కథనం ప్రకారం.. అటవీ సిబ్బంది శుక్రవారం రాత్రి ప్రత్యేకంగా గస్తీ చేపట్టారు. ఈ క్రమంలో మండల పరిధిలోని పూసుగూడెం అటవీ ప్రాంతం నుంచి లారీల్లో అక్రమంగా మట్టి తరలిస్తుండగా ఆపి పరిశీలించారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాలను స్వాధీనం చేసుకుని, పాల్వంచ రేంజ్ డిపోకు తరలించారు. కాగా సీతారామ ప్రాజెక్ట్ కాలువ మట్టిని ములకలపల్లి, పాల్వంచ మండలాల సరిహద్దులోని ఓ ప్రదేశంలో భారీగా డంప్ చేసి, విక్రయాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి అక్రమ తోలకాలు జరుపుతుండగా అటవీశాఖ అధికారులు పట్టుకున్నట్లు సమాచారం.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,400

కోతులు, కుక్కలను తరిమినోళ్లకే..

ఓటేస్తామంటున్న పల్లె ప్రజలు

- గ్రామాల్లో శునకాలు, వానరాల బెడద తీవ్రం
- నిత్యం పదుల సంఖ్యలో దాడి ఘటనలు
- పంటల చేలను నాశనం చేస్తున్న కోతులు



గ్రామంలో సంచరిస్తున్న కోతులు



వీధి కుక్కల హల్‌చల్

బూర్గంపాడు: సాధారణంగా ఎన్నికలు వస్తే రోడ్లు, డ్రెయినేజీలు, ఇళ్లు లేవని, పింఛన్లు రాలేదని పోటీ చేసే అభ్యర్థులను ఓటర్లు డిమాండ్ చేస్తుంటారు. అభ్యర్థులు కూడా వాటిపైనే హామీలిస్తుంటారు. కానీ ఈసారి పరిస్థితి మారింది. స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లో కోతులు, కుక్కల నివారణే ప్రధాన ఏజెండాగా మారనుంది. పాతికేళ్లుగా గ్రామాల్లో కోతుల బెడద పెరుగుతోంది. అదేస్థాయిలో కుక్కలు కూడా పెరిగిపోయాయి. కోతులు, కుక్కల దాడుల్లో పలువురు గాయపడుతున్నారు. జనాలు ఇళ్లలోంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. కోతులు, కుక్కల బెడదను నివారించే అభ్యర్థులకే ఓటేస్తామనే డిమాండ్ ఓటర్ల నుంచి వస్తోంది.

పంట చేలల్లోనూ కిష్కింధకాండ

రాష్ట్రంలో అటవీ ప్రాంతంగా పేరున్న జిల్లాలో పోడు సాగు ప్రభావంతో కోతులు గ్రామాల వైపు మళ్లాయి. పట్టణాల్లో కూడా కోతుల బెడద తీవ్రంగానే ఉంది. ఇళ్లను చిందరవందర చేయటంతోపాటు పిల్లలను, మహిళలను, వృద్ధులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. చేతులలో ఏదైనా కవర్ కనిపిస్తే చాలు ఎగబడి దాడిచేసి లాక్కుపోతున్నాయి. ఇంటి పెరళ్లలో కూరగాయ, పూలమొక్కలు వేసుకునే పరిస్థితులు లేవు. జిల్లాలో రోజూ కనీసం నాలుగైదు చోట్ల కోతుల దాడులలో ప్రజలు గాయపడుతున్నారు. ఇక పంటచేలను కోతుల మందలు నాశనం చేస్తున్నాయి. పత్తి కాయలను కొరికి పడేస్తున్నాయి. వరికంకులను విరిచేస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు కాపలా మనుషులను పెట్టుకోవాల్సివస్తోంది.

అభ్యర్థులు ఏమి చెబుతారో..

ప్రస్తుతం ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను బరిలోకి దింపేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ఓటర్లు మాత్రం ఈసారి స్థానిక ఎన్నికలలో కోతులు, కుక్కల నివారణ కోసం ఏమి చేస్తారని అభ్యర్థులను నిలదీసే పరిస్థితులున్నాయి. కొన్నిచోట్ల ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు లిఖిత పూర్వకంగా కోతులను, కుక్కలను తరిమేస్తామనే హామీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ముందస్తుగా కోతులు, కుక్కలు తరిమించే చర్యలు చేపట్టిన వారిని ఏకగ్రీవంగా గెలిపిస్తామని ఓటర్లు చర్చించుకుంటున్నారు.

రోజుకు 20 మందికి కుక్క కాటు..

గ్రామాల్లో వీధి కుక్కలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే రక్షణగా చేతిలో కర్ర తెచ్చుకోవాల్సి వస్తోంది. పదేళ్లుగా కుక్కల నివారణ చర్యలు చేపట్టడంలేదు. దీంతో కుక్కల దాడిలో పలువురు గాయాలపాలవుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రోజూ 20కుపైగా కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయి. పలువురు రేబిస్ వ్యాధి బారిన పడుతున్నారు. ఇటీవల పినపాక మండలంలో ఓ వ్యక్తి కుక్క కాటుతో రేబిస్ సోకి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కుక్కలు, కోతుల నివారణ చర్యలు తీసుకోవాలని ఏళ్ల తరబడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కొన్నిసార్లు అక్కడక్కడా కోతులను పట్టించే కార్యక్రమాలు చేపట్టారు. అవి కూడా తాత్కాలిక ఉపశమనమే తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదు.

కొనసాగుతున్న కోటమైసమ్మ జాతర



కోటమైసమ్మతల్లి జాతరకు తరలివచ్చిన భక్తులు

మూడోరోజూ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న భక్తులు



జాతరలో ఏర్పాటుచేసిన జాయింట్ వీల్స్

కారేపల్లి: భక్తుల కోర్కెలు తీర్చే శ్రీ కోటమైసమ్మతల్లి జాతర మూడోరోజు శనివారం అంగరంగ వైభవంగా కొనసాగింది. ప్రతీ ఏడాది దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాదాయశాఖ, పర్సా ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ఉసిరికాయలపల్లిలోని శ్రీ కోటమైసమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో జాతర నిర్వహిస్తుంటారు. ఈనెల2న ప్రారంభమైన జాతర 7వ తేదీ వరకు కొనసాగనుండగా.. భక్తులు భారీగా తరలివస్తున్నారు. 'అమ్మా మైసమ్మా.. మా తల్లీ మైసమ్మా..' అంటూ భక్తుల నామస్మరణతో ప్రాంగణం మార్మోగుతోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. దేవాదాయ శాఖ ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్ పట్టాభి రామారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో నూతన బ్రేకర్



నూతన బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ

మధిర: సిరిపురం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన నూతన బ్రేకర్‌ను విద్యుత్ శాఖ ఖమ్మం సర్కిల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి శనివారం ప్రారంభించారు. సిరిపురం సబ్‌స్టేషన్ లిఫ్ట్ ఫీడర్ నుంచి సిరిపురం లిఫ్ట్‌కు, కలకోట, బ్రాహ్మణపల్లి, రాపల్లి గ్రామాలకు సరఫరా అవుతున్న విద్యుత్‌ను, ప్రత్యామ్నాయంగా కలకోట, సిరిపురం లిఫ్ట్ ఫీడర్లుగా విడదీస్తూ సుమారు రూ.8 లక్షల వ్యయంతో నూతన బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ప్రస్తుతం ఒకే బ్రేకర్ మీద సిరిపురం లిఫ్ట్‌కు, కలకోట, బ్రాహ్మణపల్లి, రాపల్లి గ్రామాలకు సరఫరా అవుతున్న విద్యుత్‌ను ప్రత్యామ్నాయ నూతన బ్రేకర్ ఏర్పాటుతో ఈ రెండింటినీ విడదీసి అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించే అవకాశం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ డీఈ బండి శ్రీనివాసరావు, మధిర సబ్ డివిజన్ ఏడీఈ ఎం.అనురాధ, రూరల్ సెక్షన్ ఏఈ మైథిలి పాల్గొన్నారు.

రైతులకు 'పూల'బాట !



ముష్టికుంట్లలో సాగైన బంతి తోట

- పూల సాగుతో లాభాలు
- వరుస నష్టాలతో వాణిజ్య పంటలకు స్వస్తి



రోడ్డు పక్కన పూలు అమ్ముతున్న మహిళ

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో రైతులు వాణిజ్య పంటలకు స్వస్తి చెప్పి ఉద్యానవన పంటల సాగుకు మొగ్గు చూపారు. గత పది సంవత్సరాలుగా మిరప, పత్తి పంటలు సాగు చేసి నష్టపోగా, వారు ఉద్యాన పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. ఉద్యాన పంటల సాగులో అంతర పంటలను వేసి ఏడాదికి మూడు సార్లు పంటల సాగు చేసి దిగుబడులు తీస్తున్నారు.

వందల ఎకరాల్లో సాగు

బంతి, చామంతి, గులాబి పంటలను వందల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా పండుగ సీజన్లో బంతి, చామంతి, కనకాంబరాలు సాగు చేస్తూ మంచి లాభాలను గడిస్తున్నారు. వినాయక చవితి, బతుకమ్మ సీజన్లతో పాటు కార్తీక మాసాల్లో జరిపే శుభకార్యాలల్లో పూలకు మంచి గిరాకీ ఉంది. బంతి కేజీ రూ. 70 నుంచి 100 వరకు అమ్ముతున్నారు. చామంతి పూలు కేజీ రూ. 500, కనకాంబరాలు రూ. 4000, గులాబీలు కేజీ రూ. 500 వరకు ధర పలుకుతోంది. పూల సాగుకు ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుంది. పూలను అమ్మగా రూ.3 లక్షల ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. పండగ సీజన్ల తరువాత పూలను ఖమ్మం, విజయవాడ మార్కెట్లకు తరలిస్తున్నారు.

లాభసాటిగా ఉంది



పూలసాగు లాభసాటిగా ఉంది. గతంలో మిరప పంట వేసి తీవ్రంగా నష్టపోయాను. మూడు ఎకరాల్లో బంతి పూల సాగు చేపట్టాను. పండుగ సీజన్లో పూలు చేతికందేలా పంటను సాగు చేశాను. దింతో గిట్టుబాటు ధర లభిస్తోంది.

– బొడ్డుపల్లి నర్సింహారావు, ముష్టికుంట్ల

ఖమ్మం, విజయవాడలో విక్రయం



ఐదెకరాల్లో బంతి, చామంతి, గులాబీ పూల సాగు చేశాను. ప్రస్తుతం మార్కెట్లో మంచి ధర లభిస్తుండటంతో క్రమంగా పూలను ఖమ్మం, విజయవాడకు సులభతరంగా మార్కెటింగ్ చేస్తున్నా. మంచి ఆదాయం వస్తోంది.

– బొడ్డుపల్లి మల్లికార్జున్‌రావు, ముష్టికుంట్ల

రైలు ఢీకొని ఎనిమిది గేదెలు మృతి

రూ.6 లక్షల ఆస్తి నష్టం

చంద్రుగొండ: మండలంలోని శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఎనిమిది పాడి గేదెలు శనివారం సాయంత్రం బొగ్గు రైలు ఢీకొని మృత్యువాతపడ్డాయి. శ్రీరాంపురం గ్రామానికి చెందిన రైతులు సత్తి గురవయ్య, రాజబోయిన కృష్ణయ్య, తూరుపాక రాములు, ఇనుముల లాలయ్య, అనుమానాలు వెంకన్న, కే.నరేష్ మరో ఇద్దరు రైతులకు చెందిన ఎనిమిది గేదెలు ఉదయం అడవికి మేతకు వెళ్లాయి. సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా రైలు ఢీకొని మృతి చెందాయి. రైల్వేశాఖ నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యుల చెంతకు

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఏ) గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని గ్రామస్తులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అతడు అశ్వారావుపేట మండలం బండలగుంపు గ్రామానికి చెందిన సోడెం జోగారావుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు తీసుకెళ్లారు. గత నెల 26న ములకలపల్లిలో తప్పిపోయినట్లుగా కుటుంబసభ్యులు తెలిపారు. ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయమైందని, దీంతో మతిస్థిమితం సక్రమంగా లేక ఎర్రగడ్డలో చికిత్స కూడా అందించామని వారు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా



గుండాల: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/గుండాల: స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా అన్నారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో జరిగిన లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల సమావేశంలో, గుండాల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీ చేసిన ప్రతీ స్థానంలో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యత మండల, గ్రామ కమిటీలదేనని తెలిపారు. పోడు భూములకు పట్టాల మంజూరులో పార్టీ కృషి చేసిందని తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులను అడవినుంచి దూరం చేసే కుట్రలను మానుకోవాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో సీపీఐ శత వసంతాల ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. గుండాలలో వివిధ రాజకీయ పార్టీల నుంచి మోకాళ్ల సమ్మయ్య, ఎస్‌కె సాహెబ్ తదితరులు పార్టీలో చేరినట్లు తెలిపారు. సమావేశాల్లో నాయకులు సరిరెడ్డి పుల్లారెడ్డి, రేసు ఎల్లయ్య, ఉప్పుశెట్టి రాహుల్, వాగబోయిన రమేష్, కొమరం హనుమంతు, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, భూక్య దస్రు, ధీటి లక్ష్మీపతి, కోమారి హన్మంతరావు, గుత్తుల సత్యనారాయణ, ధనలక్ష్మి, జక్కుల రాములు పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌ను వినియోగించుకోవాలి

పాల్వంచ: ప్రతీ ఇంట్లో సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. శనివారం బీసీఎం రోడ్‌లో ట్రుజోన్ సోలార్ పవర్ సిస్టమ్ బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎండి.భవానీ సురేష్, చారుగుండ్ల రమేష్, సందుపట్ల శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా మావోయిస్టుకు గాయాలు

మందుపాతర అమరుస్తున్న క్రమంలో ప్రమాదం



గాయపడిన మహిళా మావోయిస్టు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మందుపాతర అమరుస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పేలి ఓ మహిళా మావోయిస్టుకు తీవ్ర గాయాలైన సంఘటన శనివారం జరిగింది. బీజాపూర్ పోలీసుల కథనం ప్రకారం.. బీజాపూర్ జిల్లా మద్దేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బందేపార అటవీ ప్రాంతంలో మావోయిస్టులు మందుపాతరలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ మందుపాతర పేలి మహిళా మావోయిస్టు గుజ్జా సోడికి తీవ్ర గాయాలయ్యాయి. సహచర మావోయిస్టులు ఆమెను అక్కడే వదిలేసి, ఆయుధం తీసుకుని వెళ్లారు. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రురాలిని బీజాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ఎటువంటి ప్రాణాపాయం లేదని పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డ సంఘటన చాపరాలపల్లి శివారులో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని విస్సన్నపేట మండలం మద్దులపర్వ గ్రామానికి చెందిన బత్తుల కిరణ్, చింతపల్లి వాసి సురేష్ ద్విచక్ర వాహనంపై ములకలపల్లి మీదుగా అన్నపురెడ్డిపల్లి వెళుతున్నారు. అదే సమయంలో అన్నపురెడ్డిపల్లి నుంచి ట్రాలీ వాహనం వస్తోంది. ఈ క్రమంలో చాపరాలపల్లి మూలమలుపు వద్ద బైక్, ట్రాలీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కిరణ్ కాలు విరిగగా, సురేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాద ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎస్. మధుప్రసాద్ తెలిపారు.


పిడుగుపాటుతో ముగ్గురికి తీవ్ర గాయాలు



ట్రాక్టర్ సాయంతో బాధితులను తీసుకొస్తున్న గ్రామస్తులు

జూలూరుపాడు: పిడుగుపాటుతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని రాంపురం తండాలో శనివారం జరిగింది. తండాకు చెందిన కొర్ర కవిత, ఆమె పదేళ్ల కుమారుడు సంతోష్, తోడి కోడలు జానులు పత్తి చేలోకి కోతులు రాకుండా కాపలా వెళ్లారు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం వచ్చింది. పిడుగుపడటంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో బాధితులను ట్రాక్టర్ సాయంతో వాగు దాటించి, కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థి మృతదేహం లభ్యం



లోహిత్ హర్ష (ఫైల్)

సుజాతనగర్: బహిర్భూమికి వెళ్లి సాగర్ కాల్వలో పడి గల్లంతైన విద్యార్థి లోహిత్ హర్ష(15) మృతదేహం ఏన్కూరు పోలీసులకు శనివారం ఉదయం లభ్యమైంది. సుజాతనగర్‌కు చెందిన బొమ్మనబోయిన లోహిత్ హర్ష శుక్రవారం సాయంత్రం ఏన్కూరు మండలం రాజలింగాలకు సమీపంలోని సాగర్ కాల్వలో గల్లంతైన విషయం విదితమే. దీంతో ఏన్కూరు పోలీసులు, రెస్క్యూ టీం ఆధ్వర్యంలో గాలింపు చేపట్టగా శనివారం ఉదయం మృతదేహం లభ్యమయింది. మృతదేహానికి ఖమ్మంలో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సుజాతనగర్‌లో మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. బాలుడి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

క్లుప్తంగా

కిన్నెరసాని నీటి విడుదల


కిన్నెరసాని నుంచి వదులుతున్న వరద నీరు

పాల్వంచరూరల్: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో కిన్నెరసాని జలాశయంలో నీటిమట్టం పెరుగుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, 1600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో ఆదివారం నీటిమట్టం 406.60 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటును ఎత్తి ఉంచి 3 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

కొత్తగూడెంటౌన్: అండర్–14, 17 విభాగాల్లో జిల్లా బాలబాలికల బాక్సింగ్ జట్లను ఎంపిక చేశారు. ఆదివారం కొత్తగూడెం సీఈఆర్ క్లబ్‌లో ఎంపికలు నిర్వహించారు. అండర్–14 బాలుర విభాగంలో ఆర్.గణేష్, కె.ధనుష్, టి. మణికంఠ, కె. పార్థు, వి.తనుష్, తేజస్, అబ్దుల్ హాసన్, వి.సాయి కిరణ్ ఎంపికయ్యారు. అండర్ –17 విభాగంలో కె.అరుణ్‌కృష్ణ, షేక్ అరహాన్ ఆలీ, వి.భార్గవ్ తేజా, సయ్యద్ అబ్దుల్ మాలిక్‌లను ఎంపిక చేశారు. అండర్–17 బాలికల విభాగంలో టి.హాసిని, బి. రూప, కె.హారిక, బి.జాహ్నవి, ఖ్యాతి భువన శ్రీ, కె.సానియాలు అర్హత సాధించినట్లు నిర్వాహకులు మట్టపర్తి రమేష్ తెలిపారు. స్కూల్ గేమ్స్ సెక్రటరీ నరేష్ ఎంపికలను పర్యవేక్షించగా, కోచ్ మట్టపర్తి మానస, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భారీ కొండచిలువ పట్టివేత


ఐడీఓసీ సమీపంలో పట్టుకున్న కొండచిలువ


పాల్వంచ: బీసీఎం రోడ్‌లోని కలెక్టరేట్(ఐడీఓసీ) సమీపంలో శనివారం రాత్రి 12 అడుగుల కొండ చిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో ఫారెస్ట్ అధికారులు, మున్సిపల్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ అక్కడికి చేరుకుని కొండచిలువను పట్టుకుని, అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి వదిలారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు రామ్ ప్రసాద్, భావ్‌సింగ్, సిబ్బంది గణేష్, శ్రీకాంత్, మహేష్, ఏడు కొండలు పాల్గొన్నారు.

భారీ వర్షంతో కూలిన వృక్షాలు


వినాయకపురం–మామిళ్లవారిగూడెం రహదారిపై అడ్డంగా పడిన వృక్షం

అశ్వారావుపేటరూరల్: మండల వ్యాప్తంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతోపాటు గాలివాన రాగా మండలంలోని వినాయకపురం–మామిళ్లవారిగూడెం ప్రధాన రహదారిపై రాత్రి పలుచోట్ల వృక్షాలు విరిగిపడ్డాయి. రహదారికి అడ్డంగా చెట్లు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అశ్వారావుపేట పట్టణంలోని ప్రధాన, అంతర్గత మార్గాలు జలమయమయ్యాయి.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి


మృతి చెందిన గేదె

ఇల్లెందురూరల్: మండలంలోని సత్యనారాయణపురం రైతు చింతిరాల వీరభద్రానికి చెందిన రెండు గేదెలు ఆదివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. తిలక్‌నగర్ సమీపంలో 11కేవీ త్రీఫేస్ విద్యుత్ లైన్ తీగలు తెగి కింద పడి ఉండగా, మేత కోసం వచ్చిన గేదెలు విద్యుదాఘాతానికి గురై చనిపోయాయి. గమనించిన పశువుల కాపర్లు మిగతా గేదెలను అటు వైపు రాకుండా మళ్లించారు. సుమారు రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని, ప్రమాద ఘటనపై ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేశానని రైతు వీరభద్రం తెలిపారు.

చేరువగా 'కేంద్రీయ' విద్య

జిల్లాకు విద్యాలయను మంజూరు చేసిన కేంద్రం

- విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్ బోధన అందుబాటులోకి..
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం


ప్రస్తుతం కేంద్రీయ పాఠశాల కార్యకలాపాలు నిర్వహించేది ఈ పాఠశాల నుంచే..

కొత్తగూడెం అర్బన్: కేంద్రీయ విద్యాలయ మంజూరుతో జిల్లా ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. పిల్లలకు ఉన్నతమైన, నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పార్లమెంట్‌లో లేవనెత్తడంతోపాటు కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేయడంతో విద్యాలయ మంజూరైంది. కొత్తగా నాలుగు విద్యాలయాలు మంజూరు కాగా, అందులో ఒకటి జిల్లాకు కేటాయించారు. కేంద్రీయ విద్యాలయలో ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు కూడా విద్యనభ్యసించే అవకాశం ఉంటుంది. సీబీఎస్‌ఈ సిలబస్ బోధిస్తారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌కు సంబంధించి విద్యను అభ్యసించాలంటే రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకోలేని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో కేంద్రీయ విద్యాలయ మంజూరు కావడంతో పేద, మధ్య తరగతి ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతుండగా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి బోధన జరుగనుంది.

నామినల్ ఫీజులతో ప్రవేశాలు

కేంద్రీయ విద్యాలయలో ఆన్‌లైన్ పద్ధతిలో నామినల్ ఫీజులతో అడ్మిషన్లు నిర్వహిస్తారు. సీబీఎస్‌ఈ విద్య కోసం ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో రూ. లక్షల్లో ఫీజులు కట్టాల్సిన పరిస్థితి ఉండదు. జిల్లాలో నియోజకవర్గానికో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరైంది. ఆ స్కూళ్లకు సంబంధించి ఇంకా గ్రౌండ్ వర్క్ కొనసాగుతోంది. ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయ కూడా రావడంతో జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉంది.

నిర్మాణానికి స్థల పరిశీలన..

కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు రామవరం, లక్ష్మీదేవిపల్లి మండలం పాలకేంద్రంలోని రెండు ఎకరాల స్థలాలను కేంద్ర బృందం పరిశీలించింది. ఏ స్థలాన్ని కూడా ఖరారు చేయకపోవడంతో మరోసారి స్థల పరిశీలన జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాలకేంద్రంలోని స్థలం విద్యాలయ నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. అప్పటివరకూ కొత్తగూడెంలోని తెలంగాణ స్కూల్‌లో విద్యాలయకు సంబంధించిన కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు అనుమతులు ఇచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా భవనాల నిర్మాణం పూర్తయితే నూతన భవనంలోనే విద్యాలయను కొనసాగించనున్నారు. లేకపోతే తెలంగాణ స్కూల్‌లో క్లాసులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, పర్యవేక్షణ, నిధులు మంజూరు తదితర కార్యకలాపాలు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే జరుగుతాయి.

పాన్‌మసాలా తయారీలో కలప!

- ఉత్తరాది రాష్ట్రాల్లో రెండు ఫ్యాక్టరీలు సీజ్
- మహబూబాబాద్ కేంద్రంగా సండ్ర కలప అక్రమ రవాణా
- దందాపై విచారణలో గుర్తించిన అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఉత్తరాది రాష్ట్రాలకు అక్రమ కలప రవాణా వ్యవహారంపై చేపడుతున్న విచారణలో ఆసక్తికరమైన అంశాలు బయటపడుతున్నాయి. 'నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్'(ఎన్టీపీసీ) పేరిట తెలంగాణ నుంచి అనుమతి ఉన్న కలప మాటున విలువైన కలపను కొంత కాలంగా రవాణా చేస్తున్నారు. సర్కారీ తుమ్మ కలప మాటున 'సండ్ర' కలపను రవాణా చేస్తుండగా మధ్యప్రదేశ్‌లో అక్కడి అటవీ అధికారులు గుర్తించి జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు విచారణ చేపట్టిన అధికారులు సండ్ర కలపను ఉత్తరాది రాష్ట్రాల్లో పాన్ మసాలా తయారీలో వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అటవీ జాతుల వృక్షాలు, మొక్కలు లేని చింతకాని ప్రాంతం నుంచి నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ విధానంలో 44 జాతుల కలపకు ఆన్‌లైన్‌లో ఎన్‌ఓసీ తీసుకున్నట్లు తేల్చారు. ఇందులో సర్కారీ తుమ్మ కలప కూడా ఉండగా ఆ స్థానంలో భారీగా సండ్ర జాతి కలపను మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, హరియాణా రాష్ట్రాలకు తరలించినట్లు బయటపడింది.

మూడు జిల్లాల్లో వృక్షాలు

అనుమతి పేరిట 'సండ్ర' కలప మహబూబాబాద్ జిల్లా కేంద్రంగా అక్రమంగా తరలిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఇప్పటికే మహబూబాబాద్‌ నుంచి కలప రవాణా చేసిన వాహనాన్ని గుర్తించి సీజ్ చేశారు. మహబూబాబాద్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల వరకు అనేక ప్రాంతాల్లో సండ్ర జాతి వృక్షాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల నుంచి సండ్ర జాతి కలపను సేకరించి సర్కారీ తుమ్మ లభించే ప్రాంతాల పేరిట పర్మిట్లను సృష్టించి ఉత్తరాది రాష్ట్రాలకు కలప రవాణా చేస్తున్నట్లుగా తేల్చారు.

పాన్ మసాలా ఫ్యాక్టరీలు సీజ్

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హరియాణా, గుజరాత్ రాష్ట్రాల్లో పాన్‌మసాలా తయారీ ఫ్యాక్టరీలు ఉండగా.. అందులో సండ్ర కలప ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. తొలుత జమ్మూకాశ్మీర్ ప్రాంతాల నుంచి కలప దిగుమతి చేసుకునేవారు. అక్కడితో పోలిస్తే తెలంగాణ ప్రాంతంలోని సండ్ర కలప మరింత మంచిదని గుర్తించిన యాజమాన్యాలు ఇక్కడి దళారులతో ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఇక్కడి వ్యాపారులు సర్కారీ తుమ్మ మాటున 'సండ్ర' కలపను అక్రమ రవాణా చేస్తుండగా.. అటవీ అధికారులు రెండు ఫ్యాక్టరీలను సీజ్ చేశారు.

టేకు కన్నా సండ్రకే డిమాండ్

ఉత్తరాది రాష్ట్రాల్లో టేకు కన్నా సండ్ర కలపకు డిమాండ్ ఎక్కువ. దీంతో అనుమతి ఉన్న కలప మాటున అనుమతులు లేని సండ్ర కలప తెలంగాణ నుంచి రవాణా చేస్తున్నట్లు గుర్తించాం. మధ్యప్రదేశ్, మహారాష్ట్రాల అటవీ శాఖల అధికారులు కలప రవాణాపై నిఘా వేసి రెండు పాన్ మసాలా ఫ్యాక్టరీలను సీజ్ చేశారు. మహబూబాబాద్ కేంద్రంగా రవాణాకు ఉపయోగించిన ఓ వాహనం కూడా పట్టుబడింది. నిర్మల్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలపై కూడా అటవీ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించారు.

– సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఖమ్మం జిల్లా అటవీ శాఖాధికారి

సిల్క్ వస్త్రంపై 'సీతారాములు'


సీతారాముల చిత్రాన్ని గీస్తున్న ముక్తేశ్వర్

భద్రాచలంఅర్బన్: సిల్క్ క్లాత్ పట్టుకుంటేనే జారిపోతుంది. అలాంటి బట్టపై ఓపికతో సీతారాముల చిత్రాన్ని వేసి తన భక్తిని చాటుకున్నాడు భద్రాచలానికి చెందిన దారా ముక్తేశ్వర్. బీటెక్ పూర్తి చేసిన ఇతను భద్రాద్రి రాములవారి కల్యాణోత్సవం సందర్భంగా వినియోగించే అడ్డు తెరపై చిత్రాన్ని ఆర్కిలిక్ పెయింట్స్‌తో గీసిన చిత్రం ఎంతో ఆకర్షణగా నిలిచింది. దాదాపు పది రోజుల 30 గంటలపాటు శ్రమించినట్లు తెలిపాడు. గతంలో రామాలయం చిత్రాన్ని గీశాడు. 3 సెంటీ మీటర్లతో అతి చిన్న మట్టి వినాయకుడి విగ్రహాన్ని తయారు చేశాడు.

ఏటీఎంలో చోరీ యత్నం

పోలీసుల రాకతో దుండగుడు పరార్


సీసీ కెమెరాలోనమోదైన నిందితుడి దృశ్యం

ములకలపల్లి: ములకలపల్లిలో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి దుండగుడు విఫలయత్నం చేశాడు. పోలీసులు కథనం ప్రకారం.. శనివారం అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఎస్‌బీఐ ఏటీఎంలో లైట్లు ఆఫ్ చేసి ఉండటంతో అనుమానం వచ్చిన పోలీసులు కారు దిగుతుండగా, ఏటీఎంలో ఉన్న దుండగుడు గమనించి పరారయ్యాడు. నగదు కోసం ఏటీఎంను పగులగొడుతున్నట్లు సీసీ కెమెరాలో రికార్డయింది. ఏటీఎం తెరచుకోకపోవడంతో నగదు చోరీకి గురికాలేదు. నిందితుడు లేతపచ్చరంగు పాలిథీన్ కవర్ ధరించి ఉన్నాడు. కొత్తగూడెం క్లూస్‌టీం సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘటనా ప్రదేశాన్ని సందర్శించి, వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు. ఎస్‌బీహెచ్ మేనేజర్ పుల్లారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుప్రసాద్ తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికుల పాట్లు



బస్టాండ్‌లో కిటకిటలాడుతున్న ప్రయాణికులు

- దసరా పండుగ ముగియడంతో తిరుగుముఖం
- ఇల్లెందులో తగిన సంఖ్యలో లేని బస్సులు

ఇల్లెందు: దసరా పండుగ అనంతరం తిరిగి వెళ్తున్న ప్రయాణికులతో ఇల్లెందు బస్టాండ్ కిటకిటలాడుతోంది. ఆదివారం బస్టాండ్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కనిపించింది. తగిన సంఖ్యలో బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు పాలయ్యారు. పండుగతోపాటు గుండాలలో నాలుగు రోజులపాటు శ్రీ మహాలక్ష్మీ దేవి ఆలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. దీంతో వివిధ ప్రాంతాల్లో ఉంటున్నవారంతా స్వగ్రామానికి చేరుకున్నారు. దసరాకు వచ్చినవారు, అమ్మవారి వేడుకలకు వచ్చినవారు తిరిగి వెళ్తుండటంతో బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసింది. ఇల్లెందు నుంచి గుండాల, మహబూబాబాద్, ఖమ్మం, కొత్తగూడెం ప్రాంతాలకు సరిపడా బస్సులు లేవని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్, మణుగూరు, గోదావరిఖని, వేములవాడ, భూపాలపల్లి, హనుమకొండ, భద్రాచలం ప్రాంతాలకు వెళ్లే బస్సులు చాలా ఆలస్యంగా వచ్చాయని తెలిపారు. దీంతో కొందరు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లారు. కాగా పండగలు వస్తే కనీసం భోజనం చేసే తీరిక కూడా ఉండటం లేదని డ్రైవర్లు, కండక్టర్లు అంటున్నారు. బస్టాండ్లలో నిలిపిన బస్సుల్లోనే భోజనాలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రయాణికుల ఇక్కట్లపై డిపో అసిస్టెంట్ మేనేజర్ సునీతను వివరణ కోరగా.. డిపోలో ఒక్క బస్సు కూడా ఉండటం లేదని, అన్ని బస్సులు రూట్లలోనే తిరుగుతున్నాయని తెలిపారు.

'స్థానికం'పై విప్లవ పార్టీల చర్చలు

ఇల్లెందు: స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు రెండు విప్లవ పార్టీల మధ్య చర్చలు సాగుతున్నాయి. ఎన్డీ మధు వర్గం, ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీల మధ్య రెండు దఫాలుగా చర్చలు జరగగా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలపై ఏకాభిప్రాయం కుదరలేదు. మొదటి దఫా రొంపేడులో, సోమవారం రెండో దఫా పోలారంలో చర్చలు జరిపారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేసే బలం తమకే ఉందని ఇరు వర్గాలు పట్టుబట్టాయి. గుండాల, ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో బలంగా ఉన్న చోట ఈ పార్టీలు పోటీ చేయాలని నిర్ణయించాయి. మెజారిటీ స్థానాల్లో తాము పోటీ చేస్తామని, తమకు మద్దతు ఇవ్వాలని మాస్‌లైన్‌ను ఎన్డీ కోరినట్లు తెలిసింది. చెరి సగం స్థానాల్లో పోటీ చేసేందుకు ఆమోదయోగ్యమైతే పొత్తుకు సై అన్నట్లు తెలిసింది. చర్చల్లో ఎన్డీ నాయకులు జే.సీతారామయ్య, ముక్తి సత్యం, కోరం సీతారాములు, గొని నాగేశ్వరరావు, తుపాకుల నాగేశ్వరరావు, మాస్‌లైన్ నాయకులు ఎస్.రాజు, ఈసం శంకర్, బుర్ర వెంకన్న, వై.సావిత్రి, పృథ్వీ, యాకుబ్‌షావలీ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

ఇల్లెందు: మండలంలోని కరెంటాఫీసు వద్ద శనివారం రాత్రి పోలీసులు గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని జగదాంబ సెంటర్‌కు చెందిన కిరాణా వ్యాపారి అన్నవరపు వెంకటేశ్వర్లు 35 బ్యాగుల గుట్కా ప్యాకెట్లు, 60 అంబర్ ప్యాకెట్లు రవాణా చేస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ గని తెలిపారు. కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

కమ్యూనిస్టులతోనే దేశ భవిష్యత్

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని


మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరభద్రం

బోనకల్: కమ్యూనిస్టులపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, వారు లేకపోతే పరిస్థితులు మరింత ప్రమాదకరంగా మారతాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తెలిపారు. బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్)లో సీపీఎం నాయకుడు మాదినేని నారాయణ కుమారుడు, రిటైర్డ్ జడ్జి మాదినేని రాధాకృష్ణ మృతిచెందగా అయన కుటుంబాన్ని ఆదివారం తమ్మినేని పరామర్శించి మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాలు డబ్బు, పదవుల చుట్టే తిరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. కమ్యూనిస్టులు ఇప్పుడు బలంగా లేకున్నా, భవిష్యత్ మాత్రం కమ్యూనిస్టులదేనని చెప్పారు. కమ్యూనిస్టులను హేళన చేసే వారికి సమాధానం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు మడిపల్లి గోపాల్‌రావు, పొన్నం వెంకటేశ్వరావు, పైడిపల్లి కిషోర్‌కుమార్, గాలి దుర్గారావు, మోదుగు సుధీర్‌బాబు తదితరులు సైతం రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

దాడి ఘటనలో కేసు నమోదు

ఇల్లెందు: దాడి ఘటనలో ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణానికి చెందిన ముసలయ్య, అతని కుమారుడు కలిసి తనతోపాటు తన కుటుంబ సభ్యులను అకారణంగా దూషించి, దాడి చేశారని మల్లిపెద్ది కమలాకర్ అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మణుగూరు టౌన్: మండలంలోని పగిడేరు గ్రామానికి చెందిన వ్యక్తి శనివారం రాత్రి పేరంటాల చెరువులో గల్లంతు కాగా, ఆదివారం మృతదేహం లభ్యమైంది. స్థానికుల కథనం ప్రకారం.. మల్లూరుకు చెందిన గోడ చరణ్(28) తన అత్తగారి ఇంటి వద్ద పగిడేరులో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి ఇద్దరు మిత్రులతో కలిసి సమీపంలోని పేరంటాల చెరువులో చేపల వేటకు వెళ్లాడు. వల వేస్తున్న క్రమంలో చరణ్ గల్లంతయ్యాడు. అతనితో వెళ్లిన మిత్రులు కుటుంబసభ్యులకు తెలపగా, రాత్రివేళ గాలించినా ప్రయోజనం లేకపోయింది. ఆదివారం పోలీసుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టగా, చరణ్ మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆయిల్‌ఫెడ్‌లో అవకతవకలపై దర్యాప్తు జరపాలి


సదస్సులో మాట్లాడుతున్న రంగారెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: ఆయిల్ ఫెడ్ సంస్థలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆయిల్ పామ్ రైతుల రాష్ట్ర స్థాయి సదస్సు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుంబూరు మహేశ్వరరెడ్డి అధ్యక్షతన ఆదివారం ఖమ్మంలో జరగగా రంగారెడ్డి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ పామాయిల్ సాగు విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించినా ఆ స్థాయిలో రైతులకు సలహాలు అందడం లేదన్నారు. అంతేకాక రైతులకు ఇబ్బందులు తలెత్తినప్పుడు బాధ్యతతో వ్యవహరించడం లేదని చెప్పారు. టన్నుకు కనీస మద్దతు ధర రూ.25 వేలు చెల్లించాలని, ఆయిల్ ఫెడ్ ద్వారా సరఫరా చేసిన మొక్కలు పెరగక నష్టోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించాలని కోరారు. రైతు సంఘం నాయకులు తుంబూరు మహేశ్వరరెడ్డి, బొంతు రాంబా బు మాట్లాడగా కొంకెరపాటి పుల్లయ్య, కారం శ్రీ రాములు, రావు జోగిబాబు, చేలికాని వెంకట్రావు, దొడ్డ చక్రధర్‌రెడ్డి, బుచ్చన్న, గురువారెడ్డి, సంగీతరెడ్డి, చలపతిరావు, ధనమ్మ, పాషా, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య


కిషోర్(ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్డ కాలనీ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కరటూరి కిషోర్(38) శనివారం పురుగుల మందు తాగగా, కుటుంబసభ్యులు అశ్వాపురం పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి భద్రాచలం, ఆ తర్వాత ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దసరా పండుగకు అత్తవారింటికి వెళ్లగా, అక్కడి గొడవ జరగడంతో కిషోర్‌ను కొట్టారని, తిరిగి ఇంటికి వచ్చాక మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లి ఫిర్యాదు చేసింది. సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేటీపీఎస్ ఆర్టిజన్..

పాల్వంచ: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగిన కేటీపీఎస్ ఆర్టిజన్ కార్మికుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నవభారత్ గాంధీనగర్‌కు చెందిన శాంపూరి ప్రవీణ్‌కుమార్ (45) కేటీపీఎస్‌లో ఆర్టిజన్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 3న పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో ..

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు కుటుంబ కలహాల కారణంగా బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఖమ్మం సారధినగర్‌లో నివాసముండే మాదాసు సాయితేజ(19) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తండ్రి ఓ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తుండగా... పిల్లలను తల్లి వదిలివేసి వెళ్లింది. దీంతో సాయితేజ సోదరి పెళ్లిని బంధువులు జరిపించారు. అయితే, ఇటీవల ఇంటి నుంచి వెళ్లిపోయిన తల్లి తిరిగి రావడం, మద్యం మత్తులో సాయి గొడవ పడుతుండడంతో అందరూ వెళ్లిపోయారు. ఆపై పెద్దమ్మ కవిత ఇంటి వద్ద ఉంటున్న సాయితేజ శనివారం రాత్రి అమ్మవారి శోభయాత్ర ముగిశాక తమ సొంతింటికి వెళ్లి ఉరి వేసుకున్నాడు. ఆదివారం ఆయన పెద్దమ్మ ఈ విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

నేలకొండపల్లి: ముదిగొండ మండలం పమ్మి గ్రామానికి చెందిన జె.రాధ నేలకొండపల్లి మండలం అనాసాగారంలో ఆదివారం కూలికి వచ్చింది. చేలో పత్తి తీస్తుండగా పాము కాటేయడంతో మిగతా కూలీలు నేలకొండపల్లి ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి


వంశీ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

మధిర: మధిర పెద్ద చెరువులో ఈతకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. ఏపీలోని ఎన్టీఆర్‌జిల్లా గంపలగూడెం మండలం తునికిపాడుకు చెందిన ఇలవరపు వంశీ (21) తన స్నేహితులతో కలిసి ఆదివారం మధిర పెద్దచెరువులో ఈతకు వెళ్లాడు. పూర్తిస్థాయిలో ఈతరాని ఆయన వంశీ ప్యాంట్‌తో పాటే చెరువులోకి దిగాక కాసేపటికి ఆయాసంతో ఒడ్డుకు చేరలేకపోయాడు. ఈ సమయాన నీటిలో మునుగుతున్న ఆయనను కాపాడేందుకు స్నేహితులు యత్నించినా ఫలితం కానరాలేదు. సమాచారం అందుకున్న స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు నాలుగుగంటల పాటు శ్రమించి అతని మృతదేహాన్ని వెలికితీశారు. అయితే, గాలింపు కొనసాగినంత సేపు వంశీ ప్రాణాలతో బయటకు వస్తాడని ఎదురు చూసిన కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా, ఆయన సంజీవరావు – మరియమ్మ దంపతుల్లో నలుగురి సంతానంలో వంశీ ఒక్కడే కుమారుడు కాగా ల్యాబ్ టెక్నీషియన్ కోర్స్ చదువుతున్న ఆయన మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది.

విరిసిన 'హరివిల్లు'



ములకలపల్లిలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అనంతరం ఆకాశంలో హరివిల్లు విరిసింది. చెదిరిపోతున్న మేఘాల నడుమ సగం మాత్రమే కనిపించిన ఇంద్ర ధనస్సు చూపరులను ఆకర్షించింది. –ములకలపల్లి